



మాట్లాడుతున్న వెంకయ్య

పీఎం కిసాన్ కార్డులను వినియోగించుకోవాలి

మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య

వికారాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు పీఎం కిసాన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్ల గ్రామంలో బ్యాంక్ రుణాలు, మంజూరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కిసాన్ కార్డు ద్వారా పొందే రుణాలకు 2 శాతం వడ్డీ తక్కువగా ఉంటుందని వాయిదాలు సకాలంలో చెల్లిస్తే అదనంగా మరో 3 శాతం వడ్డీ తక్కువ చేస్తారన్నారు. జిల్లాలోని మత్స్యకారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సదానందం, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, సంఘం అధ్యక్షులు లక్ష్మయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొత్త మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలి

హాస్టల్ విద్యార్థులకు అన్ని వసతులూ సమకూర్చాలి
వీధి కుక్కల బెడద తొలగింపునకు చర్యలు
వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో కొత్త మెనూను పాటిస్తూ పౌష్టికాహారం అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మెనూ ప్రకారం రుచికరమైన వంట చేయడం కోసం సామగ్రి ఏర్పాటు, సరుకులు కూరగాయాలు అన్నింటిలో నాణ్యత పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా రేట్ చాట్ ప్రకారం కొత్త మెనూ పాటించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్స్‌లో మైనర్ రిపైర్స్‌ను వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, కిటికీలు, డోర్స్ అన్నింటిని సిద్ధం చేయాలని ఆదేశించారు.

నాలుగు ఏబీసీ సెంటర్ల ఏర్పాటు

జిల్లాలో కుక్కల బెడద నివారించడానికి 4 మున్సిపాలిటీల్లో 4 ఏబీసీ సెంటర్స్ నెలకొల్పి స్థానిక పశువైద్యులచే జనన నియంత్రణ ఆపరేషన్స్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 700 వరకు వీధి కుక్కలలో జనన నియంత్రణ ఆపరేషన్స్ చేసినట్లు తెలిపారు. వీధి కుక్కలను పట్టడానికి అనుభవజ్ఞులైన వ్యక్తులను నియమించామన్నారు. ఆయా సెంటర్లలో ఒక్కొక్క చోట 50 కుక్కలను విడివిడిగా ఉంచి ఆపరేషన్స్‌కు ముందు ఆపరేషన్ తరువాత 5 రోజుల వరకు ఆహారం నీరు మందులు ఇచ్చి ఆ తరువాత వాటి ప్రాంతాలలో విడిచి పెడతారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, బీసీ అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి, మైనార్టీ అధికారి హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం

ఎన్నికలకు గుర్తులు ఖరారు




సర్పంచ్ ఎన్నిక గుర్తులు

సర్పంచ్‌లను ఎన్నుకునేందుకు బ్యాలెట్ పత్రంలో ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, పాన్, చెత్త డబ్బా, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, నల్లబోర్డు, బకెట్, డోర్ హ్యాండిల్, చేతి కర్ర, మంచం, బిస్కెట్, వేణువు, జల్లెడ, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, పడవ, చైన్, చెప్పులు, గాలి బుడగ గుర్తులను కేటాయించారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేశారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వీటికి అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. తాజాగా ఎన్నికల గుర్తులు కూడా ఖరారు చేశారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి 30 గుర్తులు ఖరారు చేయగా వార్డు సభ్యులకు 20 గుర్తులు ఖరారు చేశారు. సర్పంచ్ పోలింగ్‌కు పింక్ కలర్ బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రం సిద్ధం చేస్తున్నారు.

- సర్పంచ్ ఎన్నికలకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు
- బ్యాలెట్ ముద్రణకు టెండర్లు పూర్తి
- మూడు విడతల్లో ఎన్నికలు
- బీసీ రిజర్వేషన్ల ప్రకటన రాగానే ముందుకు..
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,168 పంచాయతీలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం కసరత్తును వేగవంతం చేస్తోంది. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బంది నియామకాలు సైతం చేపట్టారు. ఎన్నికల సిబ్బందితో కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు.

బ్యాలెట్ ముద్రణకు జిల్లా స్థాయిలో టెండర్లు నిర్వహించారు. ఇదిలా ఉంటే పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహిస్తుండడంతో ప్రజలకు ఎక్కువ అవగాహన ఉన్న గుర్తులనే కేటాయించారు. పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గతంలోనే

మిగతా 7వ పేజీలో...

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు
108 స్కూళ్లలో 8వేల మంది విద్యార్థులు
మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి

7

మిస్సింగ్ కేసుల కలకలం

తాండూరు పరిధిలో మూడు నెలల్లో ఆరు కేసులు
తాజాగా మరో బాలుడి అదృశ్యం

7



ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో తమ పిల్లలతో కలిసి జాగరణ చేస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

సీఎం, డిప్యూటీ సీఎంల ఫేస్ మాస్కులు ధరించి ఆందోళన

» రాత్రంతా సమ్మె శిబిరంలో పిల్లలతో జాగరణ

వికారాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మె చేపట్టి 28వ రోజుకు చేరిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉద్యోగులు శాంతియుత మహార్యాలీ నిర్వహించారు. అనంతరం బీజేఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కల ఫేస్ మాస్కులు ధరించి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. న్యాయం జరిగే వరకు తమ సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రభావతి, రాజేశ్వరి, ఆశాలత, స్రవంతి, పాతిమా, సుమిత్ర, రాగిణి, శేఖర్, శ్రీశైలం, రవికుమార్, రఘు, వెంకట్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

ఇదిలా ఉంటే, తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పురుష ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు తమ పిల్లలతో కలిసి జాగరణ చేశారు. తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని వారు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డి ఫేస్ మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, అవగాహన కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను గురువారం కలెక్టర్ గౌతమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు అధికారి కొండూరు సత్తయ్య మాట్లాడుతూ చెత్తను కాల్చితే వాయుకాలుష్యాన్ని పెంచుతుందని, విషపూరిత వాయువులను విడుదల చేస్తుందన్నారు. ఆ సమయంలో వచ్చే పొగతో శ్వాస సంబంధిత, హృదయ రోగాలు, ఆస్తమాతో పాటు కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్లాస్టిక్‌తో పాటు ఇతర పదార్థాలు కాల్చడం వల్ల డైయాక్సిన్ ఫ్యూరాన్స్ బెంజిన్ వంటి విష రసాయనాలు విడుదలై కేన్సర్‌ను సృష్టిస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్


ముమ్మరంగా ఇండస్ట్రియల్ కారిడార్ భూ సర్వే



హకీంపేటలో భూ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

దుద్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. భూ సేకరణలో భాగంగా అధికారులు హకీంపేట్ గ్రామ శివారులోని 252 సర్వే నంబరులో 351 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ సర్వే గురువారం కూడా కొనసాగింది. శుక్రవారంతో భూ సర్వే ముగియనున్నట్లు దుద్యాల, కొడంగల్ తహసీల్దార్‌లు కిషన్‌నాయక్, బీ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టాదారు రైతులు తమ హద్దులను అధికారులకు చూపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు శివకుమార్, వీరేశ్‌బాబు, నవీన్, రాఘవేందర్, నాగర్జునరెడ్డి, సర్వేయర్లు మహేశ్, ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం

- యువకుడికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత


నిందితుడు కైలాష్

మొయినాబాద్‌: జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు ఆ యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గద్వాల జిల్లా ధారూరు మండలం అల్లాపహాడ్‌ గ్రామానికి చెందిన బాలు కుటుంబం మొయినాబాద్‌కు వలస వచ్చి కూలీ పనులు చేసుకొని జీవన సాగిస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో బాలు కూతురు బహిర్భుమికి వెళ్లింది. చిలుకూరుకు చెందిన కైలాష్‌ బాలికను చెట్లపొదల్లోకి లాక్కెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాలిక కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతిక విద్యకు దూరం

- జిల్లామారినా మహబూబ్‌నగర్‌లోనే ఐటీఐ కళాశాల
- అంతదూరం వెళ్లలేకపోతున్న కొత్తూర్‌ మండల విద్యార్థులు
- ఇన్ముల్‌నర్వకు తీసుకురావాలంటున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కొత్తూర్‌ జనవరి 2:(ఆంధ్రజ్యోతి) : పునర్విభజనలో భాగంగా జిల్లా మారి ఏళ్లు గడుస్తున్నా ఐటీఐ శిక్షణ సంస్థ మారకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూర్‌ మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో రాష్ట్రంలోనే పేరుగాంచిన హజ్రత్‌ జహంగీర్‌పీర్‌ దర్గా ఉంది. కొత్తూర్‌ పారిశ్రామిక ప్రాంతం కావడంతో మైనార్టీ విద్యార్థులతో పాటు, ఇతరులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో దాదాపు 25ఏళ్ల క్రితం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు జేపీ దర్గా పేరిట ఐటీఐ కాలేజీని ఏర్పాటు చేసింది. అయితే జేపీ దర్గాలో ఐటీఐని ఏర్పాటు చేసేందుకు సదుపాయాలు లేకపోవడంతో అప్పటి జిల్లా కేంద్రంగా ఉన్న మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. నాటి నుంచి అక్కడే కాలేజీ కొనసాగుతుంది. కొత్తూర్‌



మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జేపీ ఐటీఐ

పారిశ్రామిక ప్రాంతం కావడంతో సాంకేతిక విద్య పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో ఐటీఐ శిక్షణ కేంద్రం కొనసాగుతుండటంతో ఈ ప్రాంత యువతీ, యువకులు అక్కడ చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దూరభారంతో సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా మహబూబ్‌నగర్‌ జిల్లాలోని షాద్‌నగర్‌ నియోజకవర్గాన్ని దాదాపు ఏడేళ్ల క్రితం ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసింది. షాద్‌నగర్‌ నియోజకవర్గం రంగారెడ్డి జిల్లాలో కలిసినా మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో ఉన్న ఐటీఐని జేపీ దర్గాకు మార్చేందుకు సంబంధిత శాఖ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. గతంలో దర్గా దర్శనానికి వచ్చిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు కాలేజీ మార్పుపై స్థానికులు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయంలో షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది



మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో ఉన్న జేపీ ఐటీఐ ఇన్ముల్‌నర్వకు మార్చితే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి పొందేందుకు సాంకేతిక విద్య ఎంతో దోహదపడుతుంది. ఐటీఐ మార్చాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోయింది. ఐటీఐ కోసం ఇన్ముల్‌నర్వలో స్థలం కూడా కేటాయించడం జరిగింది. అధికారులు వెంటనే స్పందించాలి.
- అజయ్‌మిట్టునాయక్‌, మాజీ సర్పంచ్‌, ఇన్ముల్‌నర్వ

ప్రైవేట్‌ స్కూళ్ల బస్సు డ్రైవర్లకు వేతనాలివ్వాలి


కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు

చేవెళ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌ స్కూళ్ల బస్సు డ్రైవర్లకు ప్రభుత్వం రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌ తెలిపారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో ప్రైవేట్‌ స్కూళ్ల బస్సు డ్రైవర్ల సంఘం జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు జీవో నెంబరు 25 ప్రకారం రూ.18,019 వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కూడా కల్పించాలని సూచించారు. యూనియన్‌ మండలాధ్యక్షుడు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి అజీమ్‌, కోశాధికారి శ్రీశైలం, ఉపాధ్యక్షులు వెంకటయ్య, అర్జున్‌, సురేష్‌, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలస్వామి, కుమార్‌, సురేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

చౌదరిగూడ/షాద్‌నగర్‌ అర్బన్‌/షాద్‌నగర్‌, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. గురువారం జిల్లేడ్‌ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్‌ నమోదు సర్వేను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కొందుర్గు మండలం ఆగిర్యాలలో క్రికెట్‌ పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌, జిల్లేడ్‌ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, డైరెక్టర్‌ వెంకటనర్సింహారెడ్డి, మల్లేష్‌గౌడ్‌, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్‌, మహేందర్‌, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేస్తున్న రోడ్లు కాంట్రాక్టర్ల సమర్థతతోనే పటిష్టంగా విస్తరించబడుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ తెలిపారు. షాద్‌నగర్‌ చౌరస్తా నుంచి జాతీయ రహదారి బైజంక్షన్‌ వరకు, కొత్తూర్‌ మండలం కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. రూ.45కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్‌ మోహన్‌రెడ్డి శరవేగంగా చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90శాతం పనులు పూర్తి చేశారు. అక్కడక్కడ మిగిలిన డ్రైనేజ్‌ పనులను పూర్తిచేస్తున్నారు. ఈమేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో కాంట్రాక్టర్‌ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ బాబర్‌, ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రకుమార్‌, ఏఈ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.


పెద్ద ఎల్కిచర్లలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ సూచించారు. గురువారం షాద్‌నగర్‌ పట్టణంలోని పద్మశాలి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులవృత్తి ఎంతో నైపుణ్యంతో కూడినదని, ఇతర వ్యక్తులు ఎవరూ కూడా ఈ వృత్తిలో అడుగుపెట్టే అవకాశం పెద్దగా ఉండదన్నారు. పద్మశాలి సంఘంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా కలిసి కట్టుగా ఉండాలని తెలిపారు. మీ సంఘానికి తన వంతు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పద్మశాలి భవన నిర్మాణం, అభివృద్ధి కోసం రూ.30లక్షల ఆర్థిక సాయం ప్రకటించి తక్షణ అవసరాల నిమిత్తం రూ.15లక్షలు అందజేశారు. పద్మశాలి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ బాబర్‌ఖాన్‌, సంఘం అధ్యక్షుడు కోట జనార్దన్‌, పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బస్వమప్ప, డంగు శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ


కొత్తూరులో నిర్వహించిన పూజలో స్వాములు

కందుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గ్రామానికి చెందిన 45మంది మాలధారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం నుంచి గ్రామంలో అయ్యప్ప ఇరుముడి మహాపడి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఇరుముడి కట్టుకున్న స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో సుమారు ఐదు వందలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

షాద్‌నగర్‌: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. గురువారం షాద్‌నగర్‌ పట్టణంలోని శివమారుతి అయ్యప్ప గీతా మందిరంలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. వందలాదిగా తరలి వచ్చిన అయ్యప్ప స్వాములకు ఎమ్మెల్యే అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు అంజనేయులు, రెటికల్‌ నందీశ్వర్‌, ఆలయ పూజారులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ప్రజలకు అండగా సీపీఐ


సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సూర్య చంద్రులు ఉన్నంత వరకూ ప్రజలకు సీపీఐ జెండా అండగా ఉంటుందని రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చారి తెలిపారు. సీపీఐ శత వసంతోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో సీపీఐ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండలాల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్‌, జంగయ్య, సురధీర్‌, మండల మహిళా అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు మగ్బుల్‌, పెంటయ్య, అంజయ్య, మీనాక్షి, కళావతి పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు కదం తొక్కిన మహిళలు

తలకొండపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం మహిళలు కదం తొక్కారు. గట్టిప్పలపల్లి గ్రామంలో గురువారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జేఏసీ నాయకులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడికి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం సాగిస్తామని జేఏసీ నాయకులు ఉద్ఘాటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 63వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ సంఘాల నేతలు కూర్చున్నారు. సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో స్థానిక ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్‌ అశోక్‌గౌడ్‌, వైస్‌ చైర్మన్లు శరత్‌చంద్ర, అంజనేయులు గౌడ్‌, కార్యదర్శి అనిల్‌, నాయకులు చంద్రశేఖర్‌, నిరంజన్‌, రాజు, శ్రీదర్‌, మల్లయ్య, జంగయ్య, చెన్నయ్య, వెంకటమ్మ, పద్మమ్మ, రాములమ్మ, పెంటమ్మ, జంగమ్మ, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో జేఏసీ నాయకులు

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్‌/ఆమనగల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్ది పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కడ్తాల మండలం పెద్ద వేములోని బావి తండాకు చెందిన బాణావత్‌ జ్యోతి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయాన్ని తండాకు చెందిన గోపినాయక్‌, బాబులాల్‌ నాయక్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన కసిరెడ్డి వైద్యచికిత్సల నిమిత్తం రూ.2.50 లక్ష ఎల్వోసీని మంజూరు చేయించారు. గురువారం కడ్తాల మండల కేంద్రంలో నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ సభ్యుడు డాక్టర్‌ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌ రెడ్డిలతో కలిసి బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ఎల్‌వోసీ ని అందజేశారు. ఆమనగల్లు మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్‌, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్యనాయక్‌, నాయకులు చేగూరి వెంకటేశ్‌, లక్ష్మయ్య, బోసురవి, రాములు, శేఖర్‌గౌడ్‌, వేణుగోపాల్‌, కృష్ణ, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్‌ రెడ్డి, శ్రీను, భిక్షపతి, చందోజీ, తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయు టీఎస్‌)-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, భార్గవి, శంకర్‌లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి ఆవిష్కరించారు. నాయకులు పురుషోత్తంరెడ్డి, పరమేశ్‌, నారాయణ, నరేందర్‌, రాజశేఖర్‌, బాలకృష్ణ, తిరుమలేశ్‌, వెంకటయ్య, కసిరెడ్డి అశోక్‌రెడ్డి, విద్యాధర్‌, మహాలింగం, విష్ణువర్ధన్‌ రెడ్డి, గఫార్‌, నాయకులు అనంత్‌రెడ్డి, అంజన్‌ రెడ్డి, బాబా, విజయ్‌రాథోడ్‌, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

హాస్టల్‌కు లేటుగా వచ్చారని..

- విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు
- కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాలలో ఘటన

చౌదరిగూడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు ఎస్సీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. గురువారం విద్యార్థులు క్రిస్మస్‌ పండగ కోసం సొంత ఊరికి వెళ్లారు. తిరిగి ఆలస్యంగా వచ్చారని పిన్సిపాల్‌, సిబ్బంది విద్యార్థులను హాస్టల్‌లోకి అనుమతించకుండా గేట్‌ వద్దే గంటల తరబడి నిలబెట్టారు. అంతేకాకుండా రూ.500 ఫైన్‌ వసూలు చేశారు. ఇదేమిటని విద్యార్థుల తల్లి దండ్రులు ప్రశ్నిస్తే.. పిల్లలను టైంకి తీసుకు రాలేదు కాబట్టి ఫైన్‌ వేస్తున్నామని తెలిపారు. ఎక్కువ మాట్లాడితే గురుకుల పాఠశాలలోనే ఉంచుకోమని, ఇంటికి తీసుకువెళ్లిపోండి అంటూ ప్రిన్సిపాల్‌ బెదిరించారు. చేసేదేమీ లేక ప్రిన్సిపాల్‌ చెప్పినట్లు గూగుల్‌ పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించారు. డబ్బులు వసూలు చేసిన ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు.



ఎస్సీ గురుకుల పాఠశాల ఎదుట కూర్చున్న విద్యార్థులు,తల్లిదండ్రులు

డబ్బులు తీసుకోవడం తప్పే..

పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు తీసుకోవడం తప్పే. విద్యార్థులకు పనిష్మెంట్‌ ఇవ్వాలనే ఉద్దేశంతోనే అలా చేశాం. డబ్బులను విద్యార్థుల తల్లిదండ్రులకు రిటర్న్‌ పంపించాం
- ప్రిన్సిపాల్‌ ఖుర్షీద్‌, ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల, కొందుర్గు

లేగదూడకు తొట్టెల కార్యక్రమం



మోమిన్‌పేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామానికి చెందిన రైతులు కుమ్మరి అంజయ్య, కమలమ్మకు చెందిన ఆవుకు ఇటీవలే ఓ లేగదూడకు జన్మనిచ్చింది. ఆవుపై ప్రేమతో మానవుడి పుట్టుక తర్వాత ఎలా అయితే కార్యక్రమాలు నిర్వహిస్తారో అదే విధంగా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. లేగ దూడ జన్మించిన 21 రోజుల సందర్భంగా తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు. రకరకాల పాటలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పాడి పశువులపై ఉన్న ప్రేమను చాటుకున్నారని అభినందించారు.

ఘట్‌కేసర్ అభివృద్ధికి నిధులివ్వండి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముల్లి పావని

ఘట్‌కేసర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పట్టణాభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేసి సహకరించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని విన్నవించారు. నగరంలోని మంత్రి నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు ఘట్‌కేసర్ రైల్వేవంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషిచేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో మహేష్, గోపాల్‌రెడ్డి, మల్లేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సాగునీరు వృథా కాకుండా చర్యలు



ప్రాజెక్టు తూము వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ధారూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి): 'సాగునీరు వృథా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి సాగునీటి శాఖ అధికారులు స్పందించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీ కెనాల్ నుంచి సాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఇరిగేషన్‌శాఖ ఈఈ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో ప్రాజెక్టు వద్ద బేబీకెనాల్ తూము షట్టర్‌కు మరమ్మతులు చేసి తూము మూసివేసి సాగునీరు బయటకు వెళ్లకుండా చేశారు. కాగా బేబీ కెనాల్‌లో నీటిప్రవాహం పూర్తిగా తగ్గిన వెంటనే పగిలిపోయిన 3వ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి సాగునీరు వృథాకాకుండా చూస్తామని అధికారులు వెల్లడించారు.

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న రాజ్‌కుమార్ కందుకూరి

వికారాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 28వ రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష హోదాలో వరంగల్ సమగ్రశిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. 28 రోజుల నుంచి వికారాబాద్ జిల్లాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అంతకు ముందు సర్వశిక్షా ఉద్యోగులు వికారాబాద్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, స్వప్నరెడ్డి, ప్రభాకర్, ప్రభావతి, బీసీ సంఘం జిల్లా నాయయకులు గడ్డం వెంకటేశ్, బీసీ నాయకులు సయ్యద్ లాల్ గుట్లపల్లి నవీన్, వివేక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి చర్యలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాసంలో ఎస్‌టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా తాత్సారం చేస్తూ వచ్చిందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయల నియామకం చేపట్టిందని.. ఇది విద్యాప్రమాణాలు పెంచడానికి దోహదం చేసిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రాజమణి, భార్గవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'తొమ్మిదిరేకుల' అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎంపీ డీకే అరుణను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి ఆ గ్రామ బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కోరారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మాడమోని శ్రీనివాస్‌గౌడ్, కల్వకోలు తిరుపతి, సురేష్, చెన్నయ్యలు గురువారం పాలమూరులోని ఆమె నివాసంలో కలిసి శాలువతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో తమ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. గ్రామాభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సంక్రాంతి గ్రామంలో పర్యటించి, అవసరం ఉన్న పనులకు నిధులు కేటాయిస్తానని తెలిపినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.



గ్రామ సమీపంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రభుత్వ భూమి

లేదు లేదంటూనే!

మళ్లీ భూ సేకరణ ప్రక్రియ?

- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- మళ్లీ తెరపైకి ఫార్మాసిటీ రగడ
- మండిపడుతున్న యాచారం, కందుకూరు మండల ప్రజలు
- ఆందోళనలు ఉధృతం చేస్తామంటున్న బాధిత రైతులు

యాచారం. జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ రగడ మళ్లీ తెరపైకి వచ్చింది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయడంతో యాచారం, కందుకూరు మండల ప్రజలు మండిపడుతున్నారు. ఫార్మా ఏర్పాటు చేయమని, రైతులకు భూములు తిరిగి ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఇప్పుడు మాట తప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మండలాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 19333 ఎకరాలు సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే పదివేల వరకు భూసేకరణ జరిగింది. ఇందులో అసైన్డ్ భూములు 6వేలు, పట్టా భూములు 4వేల ఎకరాలున్నాయి. ఇంకా 9333 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

అసెంబ్లీ ఎన్నికల ముందు..

అయితే, ఫార్మా ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీపై ఫార్మాపై హామీలు గుప్పించింది. మేము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేస్తామని, సేకరించిన భూమి ని రైతులకు తిరిగి ఇచ్చేస్తామని మాట ఇచ్చింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంలో యాచారం, కందుకూరు మండలాల ప్రజలు కీలకంగా మారారు. అంతేకాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టింది. దీంతో ఫార్మా రద్దవుతుందని, సేకరించిన భూములను ప్రభుత్వం తిరిగి ఇచ్చేస్తదని రెండు మండలాల రైతులు సంతోషపడ్డారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి కావొస్తున్నా ఫార్మా భూముల విషయం ఎటూ తేల్చలేదు.

ఉద్యమ బాట..

మరోవైపు యాచారం, కందుకూరు మండలాల్లో ఫార్మా ఏర్పాటు చేయవద్దని ప్రజలు, రైతులు ఆందోళనలు చేపడుతున్నారు. ఫార్మా కోసం మళ్లీ భూసేకరణ చేయరాదని, సేకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, అ-2/349/2024 ప్రకారం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడమేమిటని రైతులు మండిపడుతున్నారు. నోటిఫికేషన్‌లో కుర్మిద్దలో 550 ఎకరాల అసైన్డ్ భూములను సేకరించడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.



ఫార్మాసిటీ బాధిత రైతుల గోడు వింటున్న మంత్రి సీతక్క (ఫైల్)

అప్పుడు వ్యతిరేకించారు..



ఫార్మాసిటీని రద్దు చేయాలని 2020లో కుర్మిద్ద సభలో మాట్లాడుతున్న బట్టి విక్రమార్క (ఫైల్)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. 2020 సెప్టెంబరు 20న ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు మండలంలోని కుర్మిద్దలో జరిగిన బహిరంగ సభలో ఫార్మా కోసం పేదల భూములు లాక్కోవడాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చాలా సార్లు బాధిత రైతులను కలిసి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ వీళ్లెవరూ ఇప్పుడు ఈ విషయంపై నోరు విప్పడం లేదు. ఫార్మాసిటీ రద్దు చేయాలని కోరుతూ యాచారం మండల కేంద్రంలో రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పర్యావరణ శాస్త్రవేత్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

నిషేధిత జాబితాలో భూములు

మేడిపల్లిలో 483.25 ఎకరాలు, నానక్‌నగర్‌లో 154.16 ఎకరాలు, తాటిపర్తిలో 382.23 ఎకరాలు, కుర్మిద్దలో 974.4 ఎకరాల పట్టా భూములను ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో క్రయ విక్రయాలు జరపలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తల్లిదండ్రుల పేరిట ఉన్న భూములను వారసుల పేరిట మార్చుకునే వీలులేకుండా ఉందని వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ మండి పడుతుంది. ఇప్పటికైనా ఫార్మాను రద్దు చేసి రైతుల భూములను తిరిగివ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని కమిటీ నాయకులు హెచ్చరిస్తున్నారు.

భూమికి బదులు భూమి ఇస్తేనే..



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామన్నారు. ఇప్పుడు మళ్లీ ఎందుకు భూసేకరణ చేస్తున్నారు. భూమికి బదులు భూమి ఇస్తేనే మేము ఒప్పుకుంటాం. పోయిన ఏడాది కాంగ్రెస్ నాయకులు మా గ్రామంలో జరిగిన సభలో ఫార్మా రద్దు చేస్తామని మాట ఇచ్చింద్రు. ఇప్పుడు మళ్లీ భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం తగదన్నారు. ప్రాణం పోయినా మా భూములు వదులుకోం.

\- బైకని శ్రీనివాస్, రైతు, కుర్మిద్ద

ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటే..



కాంగ్రెస్ ప్రజా పాలన అంటే ఇదేనా..? పేదల భూములు తీసుకొని వారిని బంగాళాఖాతంలో పడేయడమే ప్రభుత్వ ఉద్దేశమా..? ప్రజలతో చర్చించి భూసేకరణ చేయాలి. రైతులకు జీవనాధారమైన భూములను ఏకపక్షంగా లాక్కోవడం సరికాదన్నారు. అధికారంలో రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మరిచిపోవడం దారుణం. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలకు వివరించడానికి ఉద్యమాలు చేస్తుంటే పోలీసులతో అణచివేయిస్తున్నారు. మేం న్యాయంగా పోరాడుతున్నం.

\- కవులు సరస్వతి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్

పల్లెపోరుకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

అధికార ప్రకటన చేసింది. జనవరిలోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని గతంలో మంత్రులు ప్రకటించినందున ఎన్నిలకు అధికారులు సన్నద్ధమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అంతకు మించి ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది వరకు ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. అలాగే 201 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో కూడా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

వార్డు సభ్యుల ఎన్నిక గుర్తులు

వార్డు సభ్యులను ఎన్నుకునేందుకు బ్యాలెట్ పత్రంలో పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, గౌను, ఈల, కుండ, గరాటా, మూకుడు, డిష్ యాంటీనా, ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, పోస్టు డబ్బా, కవర్, కటింగ్ ప్లేయర్, హాకీ, కత్రబంతి, నైక్ టై, విద్యుత్ స్తంభం, కేటిల్ తదితర గుర్తులు కేటాయించారు. వీటితో పాటు నోటా గుర్తు కూడా ఉంటుంది.

51 గ్రామాలు పురపాలికల్లో విలీనం

జనాభా ఆధారంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఇటీవల నిర్వహించిన ఇంటింటి మగ్ర సర్వేలో వచ్చిన వివరాలు ఆధారంగా రిజర్వేషన్లు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. ఇంటింటి సమగ్ర సర్వేలో పలు అంశాలతో పాటు కులాల వివరాలను కూడా సేకరించిన సంగతి తెలిసిందే. ఈ పక్రియ పూర్తి కావడంతో బీసీ జనాభా లెక్కలను తేలుస్తారు. బీసీ కమిషన్ ద్వారా ఈ నివేదిక ప్రభుత్వానికి అందనుంది. ఈ డేటా కంప్యూటరీకరణ పక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. ఇది పూర్తయితే స్థానిక ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. ఈనెలాఖరులోగానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత జనవరి నెలాఖరు నాటికే పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల కారణంగా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకవచ్చారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాలని సర్కార్ భావిస్తోంది. ఇపుడు పంచాయతీ ఎన్నికలు ఆలస్యమైతే దీనికి అనుగుణంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా ఆలస్యమవుతాయి. ఇటీవల ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా ఆనుకుని ఉన్న మొత్తం శివార్లలోని 51 గ్రామాలను సమీపంలోని పురపాలికల్లో విలీనం చేయడంతో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పంచాయతీల సంఖ్య తగ్గింది.

మూడు జిల్లాల్లో ఓటర్లు, వార్డుల సంఖ్య

	రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్
మండలాలు	21	3	18
పంచాయతీలు	549	34	585
వార్డులు	4,896	320	4,982
పురుష ఓటర్లు	3,99,404	32,402	3,32,038
మహిళా ఓటర్లు	3,95,216	31,992	3,39,885
ఇతరులు	33	03	17
మొత్తం ఓటర్లు	7,94,653	64,397	6,72,940

మిస్సింగ్ కేసుల కలకలం

- మూడు నెలల వ్యవధిలో ఆరు కేసులు నమోదు
- పిల్లలే టార్గెట్
- తాజాగా మరో బాలుడి అదృశ్యం



అదృశ్యమైన సమీర్(ఫైల్)

తాండూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తాండూరు పరిధిలో తరుచూ మిస్సింగ్ కేసులు నమోదువుతున్నాయి. పోలీసులకు ఈ కేసులు కునుక్కులేకుండా చేస్తున్నాయి. మూడు నెలల వ్యవధిలో తాండూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఆరు మిస్సింగ్ కేసులు, అందులో నెల రోజుల వ్యవధిలో ముగ్గురు చిన్నారులు మిస్సింగ్ కావడం చర్చనీయాంశంగా మారింది. కాగా, ఒక బాలుడు మిస్సింగ్ కేసుని ఛేధించేలోపే మరో బాలుడి అదృశ్యం కావడం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా పాత తాండూకు చెందిన మహమ్మద్ ఫీరోజ్ కొడుకు మహమ్మద్ సమీర్(14) బుధవారం ఇంటి వద్ద నున్న మసీద్‌లో నమాజ్ చదివేందుకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద చుట్టు పక్కల విచారించిన ఆచూకీ లభించక పోవడంతో గురువారం తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈనెల 29న గౌతాపూర్‌కు చెందిన చిన్నారి బాలుడు హాస్సేన్ అదృశ్యమైన విషయం తెలిసిందే. కరన్‌కోట్ పోలీసులు 24 గంటల్లోనే ఈ కేసును ఛేధించారు. ఈ ఘటన డబ్బుల కోసం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అదేవిధంగా పెద్దేముల్ మండలం ఆత్కుర్ తండాకు చెందిన కేతావత్ రేణుకా, ఆమె కూతురు శ్రీలతలు ఆస్పత్రికి వెళ్లి అదృశ్యమయ్యారు. ఈకేసును పెద్దేముల్ పోలీసులు ఇంకా ఛేదించలేదు. అదేవిధంగా తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామానికి చెందిన బక్క లాలమ్మ మనుమరాలు స్వాతి గతేడాది అక్టోబర్ 22న అదృశ్యమైంది. అప్పట్లో కిడ్నాప్ చేశారనే పుకార్లు కూడా వ్యాపించాయి. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఈ కేసులో ప్రత్యేక చొరవ చూపి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 16రోజుల తర్వాత బాలిక ఆచూకీ కనుక్కొని బాలసదనంలో చేర్పించారు. తాండూరు ప్రాంతంలో తరుచుగా ఇలాంటివి సంఘటనలు జరుగుతుండటంతో పాఠశాలలకు వెళ్లే చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు : విజయకుమారి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫైనల్ పరీక్షలకు మరో మూడు నెలల సమయమే ఉంది. జిల్లాలో 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో జిల్లా విద్యాధికారి విజయకుమారి గురువారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి: ఈ విద్యాసంవత్సరం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: గత సంవత్సరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాష్ట్రంలో 14 స్థానంలో ఉంది. ఈ విద్యాసంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రత్యేక నోట్స్ కూడా తయారు చేసి ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రత్యేక తరగతులను ఎలా నిర్వహిస్తున్నారు?

డీఈవో: నాలుగు నెలల నుంచి పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఫిబ్రవరి వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుంది. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇంటి వద్ద కూడా వేకువజామున విద్యార్థులు చదువుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఏఏ సబ్జెక్టులపై ప్రధానంగా ఫోకస్ పెట్టారు?

డీఈవో: విద్యార్థులు ప్రధానంగా ఆంగ్లం, సామాన్య శాస్త్రం, గణితం సబ్జెక్టులను హార్డ్ సబ్జెకులుగా భావిస్తారు. ఈ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందుకెళ్తున్నాం.


ఆంధ్రజ్యోతి: ఫైనల్ పరీక్షలకు ముందు టెస్టులు నిర్వహిస్తున్నారా?

డీఈవో: ఫైనల్ పరీక్షలపై విద్యార్థులకు పట్టుపెరిగే విధంగా ప్రతీవారం పరీక్ష నిర్వహిస్తున్నాం. ప్రతీరోజు ఓరల్, స్లిప్ టెస్ట్ వంటివి నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు తొలగించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతాయి.

ఆంధ్రజ్యోతి: ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు?

డీఈవో: హెచ్‌ఎంలకు సమావేశాలు నిర్వహించి సూచనలు చేశాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పాం. తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించాం. మేడ్చల్ బడియాప్‌తో రూపొందించిన యాప్‌లో ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణపై అవగాహన కల్పించాం.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



మందులు అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జైపాల్ యాదవ్

కడ్తాల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని వారు కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేష్, దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి సబితాఇంద్రారెడ్డి, నవీన్ రెడ్డి, జైపాల్‌యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజినిసాయిచందలు ప్రారంభించారు. డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలోని కామినేని ఆసుపత్రి వైద్య బృందం శిబిరంలో 680 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఉప్పల వెంకటేష్, దశరథ్ నాయక్‌లు అందిస్తున్న సేవలను సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, నవీన్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌లు అభినందించారు. తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, కడ్తాల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ఎర్రోళ్ల రాఘవేందర్, శ్రీనివాస్ యాదవ్, బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మంగళపల్లి నర్సింహ, వీరయ్య, లాయక్‌అలీ, అంజి, వెంకటేష్, గంప శ్రీను, అశోక్‌గౌడ్, బుచ్చిబాబు, జ్యోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు

- స్వచ్ఛభారత్ మిషన్ కింద నిధులు
- ఉపాధి హామీ పథకం ద్వారా పనులు
- తొలుత బషీరాబాద్ మండలంలో స్థల పరిశీలనకు ఆదేశాలు


కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నమూనా చిత్రం

బషీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరుబయట మలమూత్ర విసర్జన రహితంగా గ్రామాలను తీర్చిదిదడానికి జనసామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్ల(కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి గల పంచాయతీలను గుర్తించి, ఎంపిక చేసే పనిలో సంబంధిత అధికారులున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టబోయే ఈ మరుగుదొడ్లకు రూ.3లక్షల నిర్మాణ వ్యయం కాగా, గ్రామ పంచాయతీలు వాటాధనం కింద కింద 30శాతం నిధులిస్తే మిగతా 70శాతం ప్రభుత్వం చెల్లిస్తోంది. వీటిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 230పనిదినాలు కల్పించి వీటిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

తొలుత మండలానికి ఒక నిర్మాణం

తొలుత మండలానికో పంచాయతీలో సామూహిక మరుగుదొడ్డిని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు 30శాతం నిధులు ఆయా పంచాయతీలు 15 వఆర్థిక సంఘం నుంచి సమకూరిస్తే, 70శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ మరుగుదొడ్లను జనసందడి ఎక్కువగా ఉన్నప్రాంతాలు అంటే ఆవాస విద్యాలయాలు, బస్టాండ్‌లు, సందర్శన క్షేత్రాలు, వారంతపు సంతలు తదితర చోట్ల నిర్మించాలి. ఎలాంటి వివాదాలకు తావులేకుండా స్థలాన్ని పంచాయతీయే నిర్ణయించాలి. మూత్రశాలలు, నాలుగు కంపార్ట్‌మెంట్ మరుగుదొడ్లు, (రెండు ఇండియన్ కుండీల పద్ధతిన) నిర్మిస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా 120 చదరపు గజాల స్థలంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. పచ్చదనం విరజిల్లేలా అన్ని సౌకర్యాలతో నిర్మించి ఎవరైనా సరే ఇబ్బందులు లేకుండా కాలకృత్యాలు తీర్చుకునే విధంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు.

రుసుము వసూలు

మరుగుదొడ్ల నిర్వహణకు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిని నియమించి నగదు పద్ధతిన నామమాత్రంగా కొంత రుసుము వసూలు చేయనున్నారు. మూత్ర విసర్జనకు రూ.2, మల విసర్జనకు రూ.5 తీసుకుంటారు. వాటి పరిశుభ్రత, నిర్వహణను కార్మికులు చూసుకోవాల్సి ఉంటుంది.

స్థలం గుర్తిస్తున్నాం



బషీరాబాద్‌లో సామూహిక మరుగుదొడ్డి ముందుగా నిర్మించాలని నిర్ణయించాం. ఈ మేరకు కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశాం. ఇక్కడా వారంతపు సంత జరుగుతున్నందున ప్రజలకు సామూహిక మరుగుదొడ్డి ఎంతో ఉపయోగపడనుంది. ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం. - విజయ్‌కుమార్, ఎంపీడీవో

సమస్యలు పేరుకుపోతున్నాయ్!

- కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయండి
- తాండూరు కౌన్సిలర్ల డిమాండ్
- పట్టించుకోని కమిషనర్, చైర్‌పర్సన్


తాండూరు మున్సిపాలిటీ కార్యాలయం

తాండూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. చర్చించేందుకు తక్షణమే కౌన్సిల్ సమావేశాలు పెట్టండండి అంటూ తాండూరు మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ వికారాబాద్ జిల్లా అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్‌కు, కౌన్సిలర్లు వరాల శ్రీనివాస్‌రెడ్డి , శోభరాణి , సంగీత ఠాకూర్‌లు సంయుక్తంగా కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. గత 2024 ఆగస్టు 3న మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. గత నాలుగు నెలలుగా సెప్టెంబరు నుంచి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదు. తమ ఐదేళ్ల ఏళ్ల గడువు దగ్గర పడుతుందని కౌన్సిలర్లు వాపోతున్నారు. కనీసం చివరి సమావేశమైన ఏర్పాటు చేయాలని, ఈవిషయంలో కమిషనర్, చైర్‌పర్సన్లు పట్టించుకోవడంలేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులు చేపట్టాలంటే కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి. దీంతో ప్రజలకు కనీస సౌకర్యాలైన మురుగు కాల్వలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలు, తాగునీటి పైపుల మరమ్మతులు, కొత్త పైపులైన్లు, స్ట్రీట్ లైట్ల కొనుగోలు వంటి వాటిని చేపట్టాలంటే కౌన్సిలర్ తీర్మానం అవసరం. ఈనెల 26తో ప్రస్తుత పాలకవర్గం గడువు ముగుస్తుంది. ఇంకా 23రోజులు మాత్రమే గడువు ఉందని, ఇప్పటికైనా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


పరిగిలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మోమిన్‌పేట్: నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, వెంకట్

తాండూరు/తాండూరు రూరల్/యాలాల/బషీరాబాద్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జైపాల్ రెడ్డి, వినోద్, కృష్ణారెడ్డి, రాములు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు మండల పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్, వినోద్‌కుమార్, పట్లోళ్ల పురుషోత్తం రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా యాలాల మండల పీఆర్టీయూటీఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి న్యూఇయర్ విషెస్ తెలిపి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సి.కృష్ణారెడ్డి, సీహెచ్.రాములు, మొగులయ్య, మహేష్‌కుమార్ పాల్గొన్నారు. అదే విధంగా వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌రాం రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ బషీరాబాద్ మండలశాఖ క్యాలెండర్‌నూ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మండలశాఖ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని తన నివాసంలో గురువారం పీఆర్టీయూ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి డి.అమర్‌నాథ్, సి.రామాంజనేయులు, బుగ్గయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, సుందరి అనిల్, వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో గురువారం పీఆర్టీయూ మండలశాఖ మండల విద్యాధికారి నర్సింగ్ రావు, మండల తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్‌తో పాటు కాంప్లెక్స్ హెచ్ఎంలు అక్కమహాదేవి, సునీత, భోజప్ప చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నవీన్ కుమార్, వెంకటరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధారూరు: పీఆర్‌టీయూ నూతన సంవత్సర వాల్ క్యాలండర్, టేబుల్ క్యాలండర్‌ను మండల పరిషత్తు కార్యాలయం ఆవరణంలో తహసీల్దార్ సాజిదాబేగం ఎంఈవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, మాణిక్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలండర్‌ను మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఆవరణలో గురువారం మండలశాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నేతలు


దుద్యాల: సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ ముదిరాజ్, సంతోష్ గౌడ్‌లు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దుద్యాల/దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని దుద్యాల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పనులు, భూసేకరణలో భాగంగా రైతులకు పరిహారం పెంచాలని సీఎంను కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, అనంతయ్య, యుగేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, సీనియర్ నాయకులు బోడి వెంకట్‌రెడ్డి, వీరన్న, కృష్ణ, మహిపాల్ తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేష్‌తో పాటు నాయకులు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజేష్‌తో పాటు శ్రీనివాస్‌రెడ్డి, తుంగతుర్తి రవిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట తాండూరు పట్టణ సీఐ సంతోష్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌కు న్యూఇయర్ విషెస్



మేడ్చల్ ప్రతినిధి, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతిలు గురువారం కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

వికారాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి బీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సబితారెడ్డి నివాసంలో వికారాబాద్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు అండగా నిలుస్తాం

మేడ్చల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు అండగా నిలుస్తామని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గురువారం దుస్తుల పంపిణీ చేశారు.

ఎంఎల్‌హెచ్‌పీల నియామకం

వికారాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం నూతనంగా నియమితులైన 14 మంది ఎంఎల్‌హెచ్‌పీలకు నియామక పత్రాలను అందజేశారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్పీకర్, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ డిప్యూటీ డీఎంహెచ్‌వో జవరాజు, డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

చీఫ్‌విప్ పరామర్శ

యాలాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అగ్గనూరుకు చెందిన ఉప్పరి వెంకటయ్య బుధవారం రాత్రి తీవ్ర బీపీతో హైదరాబాద్‌లోని దక్కన్ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మండల నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

దుకాణాల అద్దె వేలం

పెద్దేముల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దుకాణాలను అద్దె ప్రాతిపదికన వేలం వేయనున్నట్లు ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 4వ తేదీన జరిగే వేలంలో పాల్గొని దుకాణాలను సొంతం చేసుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు.

పాత పంచాయతీ భవనం కూల్చివేత

పరిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నస్కల్‌లో పురాతన పాత గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని గురువారం కూల్చివేశారు. కొత్తగా పంచాయితీ కార్యాలయం నిర్మించిన తర్వాత పాత భవనం ఉపయోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇళ్ల మధ్యలో ఉన్న కార్యాలయంను కూల్చివేయడంపై గ్రామస్తులు కొందరు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. పాత పంచాయితీ భవనాన్ని కూల్చి కొందరు కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపించారు. గ్రామసభలో తీర్మానం చేసిన తర్వాతనే కూల్చి వేశామని పంచాయితీ కార్యదర్శి పారూక్‌హుస్సేన్ తెలిపారు.

చెన్‌గోముల్ పీఎస్‌ను సందర్శించిన సీఐ

పూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌ను పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది, గ్రామ పోలీసు విధుల గురించి, వచ్చిన ఫిర్యాదులపై ఎస్ఐ మధుసూదనరెడ్డితో మాట్లాడారు.

న్యూస్ బాక్స్

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్య


డిజిటల్ తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు ప్రభుత్వం విద్యను అందిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని పులుమామిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం డిజిటల్ తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, టైలను పంపిణీ చేశారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

దోమ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డిపై గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. తీర్మానంలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన ఆగిరాల యాదవరెడ్డి చైర్మన్‌గా నెగ్గారు. అదేవిధంగా ఈనెల 3న చైర్మన్, డైరెక్టర్‌లతో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు నూతన చైర్మన్ యాదవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్పస్వామి పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం అయ్యప్పస్వామి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి, జడ్పీటీసీ ధారాసింగ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శంభులింగేశ్వర్ ఆలయంలో మహాపడిపూజ నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మహాపడిపూజకు హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతులు పంటలను నమోదు చేసుకోవాలి

దుద్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఏఈవోల దగ్గర పంటల నమోదు చేసుకోవాలని కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. మండలంలోని పోలెపల్లిలో వేరుశనగ పంటలను గురువారం పరిశీలించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మాణికేశ్వరి, రైతులు వెంకట్ పాల్గొన్నారు.

ప్రజయ్ హోమ్స్ కాలనీ అభివృద్ధికి కృషి

శామీర్‌పేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తాను ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయిన ప్రజయ్‌హోమ్స్ కాలనీ అబివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎంపీటీసీ నరసం అశోక్‌రెడ్డి అన్నారు. మజీద్‌పూర్ గ్రామ పరిధిలోని ప్రజయ్ హోమ్స్ కాలనీలో అశోక్‌రెడ్డి సొంత నిధులు రూ.4లక్షలా 50 వేలతో డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

దోమ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 18మండలాల ఎంపీడీవోలతో కలిసి జిల్లా అధ్యక్షుడిగా దోమ మండల ఎంపీడీవో హెచ్.మహేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా అనురాధ (నవాబుపేట), కోశాధికారి నర్సింహులు (ధారూర్), ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా వెంకన్నగౌడ్ (బొంరాస్‌పేట్, విశ్వప్రసాద్ (తాండూర్), ఉషశ్రీ (కొడంగల్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరాములు ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

కులకచర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. గురువారం కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్‌లో యాదయ్యకు రూ.1లక్ష 20వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

ఓటరు జాబితాపై సమావేశం

కొడంగల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఆర్-2025 ఓటరు జాబితాపై రాజకీయ నాయకులతో తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 6న ఎస్ఎస్ఆర్-2025 తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పరిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం గురువారం రాత్రి గడిసింగాపూర్ శివారులో జరిగింది. బొంరాస్‌పేట్ మండలం మదన్‌పల్లికి చెందిన అశోక్(26) షాద్‌నగర్‌లోని ఓహోటల్‌లో పనిచేస్తుంటాడు. అశోక్ గురువారం రాత్రి స్వగ్రామం నుంచి షాద్‌నగర్‌కు తన బైక్‌పై బయల్దేరాడు. పరిగి మండలం గడిసింగాపూర్ శివారులో రోడ్డు పక్కనే నిలిపి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో అశోక్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిగి ఆస్పత్రికి తరలించారు. మృతుడికి గత వారం కిందటే ఎంగేజ్మెంట్ అయినట్లు సమాచారం. సొలిప్పలిబాట తండా దగ్గర రోడ్డు పక్కనే లారీలను నిలుపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మరో యువకుడు..

పరిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న యువకుడు లారీ ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన గురువారం పరిగి శివారులో చోటుచేసుకుంది. కర్ణాటకలోని సేడెం తాలుకా మల్కేడ్‌కు చెందిన కోట్రిక శాంతకుమార్(36) ఉపాధి కోసం హైదరాబాద్‌లో పనిచేస్తుంటారు. గురువారం ఉదయం స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరగా పరిగి శివారు ప్రాంతంలోని ఏబీఎస్ ప్లాజా వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శాంతకుమార్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని..

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బాల్కనీపై నుంచి పడి ఓవిద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మేడిపల్లికి చెందిన వాస చంద్రశేఖర్, భార్య, కూతురు, కొడుకుతో కలిసి పోచారం మున్సిపాలిటీ, రెడ్డి నివాసంలోని 4వ అంతస్తులో ఉంటున్నారు. గతేడాది డిసెంబరు 31 ఉదయం 7గంటలకు తన కూతురు వాస శ్రీజ(16) వాష్‌రూం వెళ్లి వచ్చి బాల్కనీ నిలబడింది. కళ్లుతిరిగి 4వ అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్రగాయాలపాలైంది. కుటుంబసభ్యుల చికిత్స నిమిత్తం మేడిపల్లిలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శ్రీజ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందింది. శ్రీజ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బావిలో పడి పశువుల కాపరి..

తాండూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బావిలో పడి పశువుల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కరన్‌కోట్‌లో చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలేపల్లి నరేష్(23) కొడగంటి రాములు వద్ద గేదెల కాపరిగా పనిచేస్తున్నాడు. అయితే యజమానికి రాములుకు నరేష్ ఈనెల 1న జీతం డబ్బులు అడిగాడు. జీతం డబ్బులు ఇస్తే మద్యం తాగుతాడనే ఉద్దేశంతో డబ్బులు ఇవ్వలేదు. దీంతో నరేష్ తన అన్న లస్మప్ప, బాబాయి వెంటప్పను వెంట పెట్టుకుని యజమాని ఇంటికి బయల్దేరారు. లస్మయ్య, వెంటప్ప ముందుగా వెళ్లగా వెనకాలే వస్తున్న నరేష్ మద్యంమత్తులో ఉండటంతో మార్గమధ్యలో ఓబావిలో పడి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

డ్రైవర్‌పై దాడి.. ఆరుగురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గోవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని, డీసీఎం డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి-భువనగిరి జిల్లా నుంచి డీసీఎం వ్యాన్‌లో నగరానికి గోవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో గోరక్షదళ్ సభ్యులు బుధవారం రాత్రి ఘట్‌కేసర్‌లోని బైపాస్ వద్ద అడ్డుకున్నారు. డీసీఎం డ్రైవర్ మహ్మద్ ఓమర్ ఖురేషీ పరారవుతుండగా దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఏఐఎంఐఎం, బీజేపీ నాయకులు పోటాపోటీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఏఐఎంఐఎం ఎంఎల్‌సీ మీర్జా రహ్మత్ బేగ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించారు. దాడిలో గాయపడిన ఓమర్‌ను నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు గోరక్షదళ్ సభ్యులు పవన్ కళ్యాణ్, వినయ్‌కుమార్, కాలీసింగ్, దీపక్ సింగ్, కాదర్‌సింగ్, పవన్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న 10 మంది అరెస్ట్

బంట్వారం జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 10మందిని బంట్వారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంగ్రాస్‌పల్లి సమీపంలో పేకాడుతున్నట్లు తమకు పక్కా సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి 10మందిని, రూ.4వేల నగదు స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసినటు తెలిపారు. వీరు బంట్వారం మండలంలోని మంగ్రాస్‌పల్లి, కోట్‌పల్లి మండలంలోని మొత్కుపల్లి గ్రామాలకు చెందిన వారు ఉన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

కులకచర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని సాల్విడ్‌కు చెందిన చిపిరి అంజిలయ్య బైక్‌పై గురువారం సాయంత్రం గ్రామానికి వెళ్తున్నాడు. బండవెల్కిచర్ల దారిలో పాంబండ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి పడటంతో అంజిలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

కళాశాల సెక్యూరిటీ గార్డుపై దాడి

మూడుచింతలపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కళాశాల సెక్యూరిటీ గార్డుపై గుర్తు తెలియని దుండగులు దాడిచేసి పరారయ్యారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌షరీఫ్ కొంత కాలంగా తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. జనవరి 1వ తేదీన నలుపు రంగు కారులో వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కళాశాల గేటు తెరవాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డు కళాశాల సమయం ముగిసిందని తీయక పోవడంతో అతడిపై కర్రలతో దాడి చేశారు. కారు తాళంతో కడుపులో పొడిచి పరారయ్యారు. గాయాలపాలైన సెక్యూరిటీ గార్డును 108 అంబులెన్స్‌లో తూంకుంటలో ఆర్ఎక్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

మేడ్చల్ టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి మేడ్చల్ ప్రాంతం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మెట్రో సేవల హామీని నెరవేర్చాని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మేడ్చల్‌కు మెట్రో ఫేస్-బి ప్రాజెక్టును చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయటంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలోని వివేకానంద చౌరస్తా వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, రమణారెడ్డి, జాకట దేవరాజ్, కౌడె మహేష్ పాల్గొన్నారు.